నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 14 నవంబర్ 2024 | ADILABAD NIRMAL

## బస్సు కోసం మహిళల ధర్నా


మహిళలతో మాట్లాడుతున్న సీఐ సైదారావు

దస్తురాబాద్, నవంబర్ 13 : గొడిసేర్యాలకు చెందిన మహిళలు ఆర్టీసీ బస్సు నడిపించాలని బుధవారం ఎక్స్ రోడ్డు వద్ద ధర్నా చేశారు. మహిళలు ధర్నా చేయడంతో బస్సులు, ఆటోల రాకపోకలు నిలిచిపోయాయి. జగిత్యాల జిల్లా నుంచి కడెం వరకు మండల కేంద్రం గుండా బస్సు సర్వీస్‌లు నడుస్తున్నాయి. అలాగే నూతనంగా ఉట్నూర్ డిపో నుంచి మండల కేంద్రం మీదుగా ఖానాపూర్ వరకు బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఈ బస్సు సర్వీస్‌లు తమ గ్రామం గుండా వెళ్లాలని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్ఐ శంకర్ ధర్నా స్థలానికి చేరుకున్నారు. జగిత్యాల డిపో మేనేజర్, ఆర్ఎంలతో ఫోన్‌లో మాట్లాడారు. రూట్ సర్వేను నిర్వహించి, బస్సు సర్వీస్‌లు నడిపే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. సీఐ మహిళలకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. వీరికి బీఆర్ఎస్ నాయకులు మాణిక్ రావు, దాసరి సుధాకర్, రాజనర్సయ్యలు మద్దతుగా నిలిచారు.

## విద్యార్థినికి న్యాయం చేయండి

### కలెక్టర్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఎదులాపురం, నవంబర్ 13 : బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినికి న్యాయం చేయాలని ఏబీవీపీ ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ ఖేడిసె అక్షయ్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే విద్యార్థి నాయకులపై సిబ్బందితో దాడి చేయించడం శోచనీయమన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టర్ చౌరస్తా వద్ద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆదిలాబాద్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ ఖేడిసె అక్షయ్ మాట్లాడుతూ.. 48 గంటలు గడుస్తున్నా.. రేవంత్‌రెడ్డి సర్కారు విద్యార్థి మృతిపై మాట్లాడకపోవడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో అక్షయ్, కార్తీక్, నిఖిల్, సాయి పాల్గొన్నారు.


↑ బోథ్ : సర్వే అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

## సర్వే అడ్డగింత

- బాబెర తండాగా మారిస్తేనే సహకరిస్తాం..
- వడ్లు తూకం వేసి వివరాలు సేకరించాలి అంటున్న వడ్తాల్ గ్రామస్తులు

బోథ్/ముథోల్, నవంబర్ 13 : సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చిన అధికారులను ప్రజలు అడ్డుకుంటున్నారు. తాజాగా బుధవారం బోథ్ మండలంలోని లంబాడితండా గ్రామ పంచాయతీ పేరును బాబెర తండాగా మారిస్తేనే సర్వేకు సహకరిస్తామని గ్రామస్తులు అల్టిమేటం జారీ చేశారు. సర్వేకు వచ్చిన సిబ్బందిని గ్రామస్తులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో రమేశ్, ఎంపీవో జీవన్‌రెడ్డి గ్రామస్తులతో మాట్లాడారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సర్ది చెప్పారు. ఈ విషయమై గ్రామస్తులు వినతి పత్రం అందజేయగా.. కలెక్టర్‌కు విన్నవించనున్నట్లు పేర్కొన్నారు. కాగా.. నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని వడ్తాల్ గ్రామంలో వడ్లు కొనుగోలు చేసే వరకు సర్వే నిర్వహించవద్దని గ్రామస్తులు అధికారులను విన్నవించారు. దీంతో ఆర్ఐ నారాయణ రావు పటేల్ రైతులకు సముదాయించి ఉన్నతాధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం సమగ్ర సర్వే కూడా ప్రారంభమైంది.


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

## బలహీన వర్గాల కోసం సీఎంఆర్ఎఫ్

### బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, నవంబర్ 13 : బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించడం జరుగుతుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. బుధవారం నేరడిగొండలోని ఆయన నివాసంలో 20 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించి వారికి అండగా నిలవడం జరుగుతుందన్నారు. ఎవరైన ఆస్పత్రిలో చేరిన వారు బిల్లులను తన చాంబర్‌లో అందిస్తే తప్పకుండా ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ప్రీతం రెడ్డి, తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పర్యవేక్షణ నీవెక్కడ?



### ఐదు వేల మంది విద్యార్థినులకు నలుగురే కేర్ టేకర్లు

- 14 మంది కేర్ టేకర్ల కోసం మార్చిలో నోటిఫికేషన్ జారీ
- ఎనిమిది నెలలు అవుతున్నా నియామకం లేదు..
- జాప్యంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు
- నోటిఫికేషన్ వెలువడిన నుంచి ఇద్దరు ఆత్మహత్య

*బాసర ట్రిపుల్ ఐటీలోని విద్యార్థులపై పర్యవేక్షణ కరువైంది. ఇందులో తొమ్మిది వేల మంది విద్యార్థులు ఉండగా.. ఇందులో దాదాపు ఐదు వేల మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరిని పర్యవేక్షించడానికి నలుగురు మాత్రమే ఉమెన్ కేర్ టేకర్స్ ఉన్నారు. హాస్టల్‌లో ఐదు వేల మంది విద్యార్థినులకు దాదాపు 50 మంది కి పైగా ఉమెన్ కేర్ టేకర్స్, 20 మంది వార్డెన్‌లు, పది మందికిపైగా కౌన్సిలర్లు ఉండాలి. కానీ.. నలుగురు కేర్ టేకర్స్ మాత్రమే ఉండడం సమస్యగా మారింది. సిబ్బందిని నియమించి, విద్యార్థుల యోగాక్షేమాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తే ఆత్మహత్యలు పునరావృతం కాకుండా ఉండే అవకాశం ఉంది. కాగా.. నోటిఫికేషన్ వెలువడిన నుంచి ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.*

*- బాసర, నవంబర్ 13*

బాసర ట్రిపుల్ ఐటీ ప్రాంగణం




5. **Schedule:**

Candidates are instructed to submit the duly filled attached application form along with photocopies of all certificates and also required to bring the all original certificates (for verification only) along with four (04) copies of Resume/CV while attending the Walk-in interview scheduled as below:

| Sl. No. | Date and time of interview | Venue |
|---|---|---|
| 1 | 13-03-2024 (Wednesday), 10:00 AM | RGUKT Basar Campus, Basar (Village & Mandal), Nirmal (District), Telangana. |

Note: 1) Candidates with higher qualification will be preferred.
2) University reserves the right to fill or not to fill any or all the positions.

Sd/-
Special Officer

6 మార్చి 2014న ట్రిపుల్ ఐటీ విడుదల చేసిన నోటిఫికేషన్

### పలువురిపై కేసు

స్వాతిప్రియ ఆత్మహత్య ఘటనలో ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ట్రిపుల్ ఐటీలోని యాజమాన్యం, ఇద్దరు విద్యార్థులు కారణం అని పేర్కొన్నారు. దీంతో బాసర పోలీసులు ట్రిపుల్ ఐటీ ఏవో రణధీర్, అసోసియేట్ డీన్, స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, కేర్ టేకర్ శ్రవంతి, అసోసియేట్ డీన్ హ్యుమానిటీస్ అండ్ సైన్స్ పావనితోపాటు ఇద్దరు విద్యార్థులపై కేసులు నమోదు చేశారు. స్వాతిప్రియ ఆత్మహత్యలో కీలకంగా ఫోన్ డాటా ఆధారంగా లోతుగా పోలీసులు విచారణ చేస్తున్నారు. స్వాతిప్రియ ఆత్మహత్యకు సీనియర్ విద్యార్థుల వేధింపులు కారణమా? ట్రిపుల్ ఐటీ అధికారుల ఒత్తిడి కారణమా? వ్యక్తిగత కారణాలు ఉన్నాయా? అనే కోణంలో స్వాతిప్రియ ఫోన్ డాటా ఆధారంగా విచారణ నిర్వహిస్తున్నారు.

### మార్చిలో నోటిఫికేషన్

విద్యార్థుల యోగ క్షేమాలు చూసుకోవడానికి ఈ యేడాది మార్చి 6వ తేదీన 14 మంది ఉమెన్ కేర్ టేకర్స్ నియామకానికి అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. వీటికి దాదాపు 60కిపైగా దరఖాస్తులు వచ్చాయి. మార్చి 13వ తేదీన ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటి వరకు ఎంపిక జాబితాను విడుదల చేయలేదు. ఇంతకు ముందు ఉన్న ఇన్‌చార్జి వీసీ హయాంలో నోటిఫికేషన్, ఇంటర్వ్యూలు, ఎంపిక జాబిత తయారు చేశారు. కానీ.. ఇప్పటి వరకు వీటి నియామకం చేయకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థినుల యోగ క్షేమాలు తెలుసుకోవడానికి హాస్టల్‌లో ఒక్కో ఫ్లోర్‌కు ముగ్గురు కేర్ టేకర్లు అవసరం. నోటిఫికేషన్ వేసి 14 మందిని నియమించకపోవడం, ఇంకా మిగతా అవసరం ఉన్న కేర్ టేకర్లను, వార్డెన్‌లను, కౌన్సిలర్‌లను ఎప్పుడు నియమిస్తారో అర్థం కావడం లేదు. కేర్ టేకర్ల నియామకంపై ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

## ట్రిపుల్ ఐటీకి డీఎస్పీ నియామకం


డీఎస్పీ రాజేశ్

బాసర, నవంబర్ 13 : బాసర ట్రిపుల్ ఐటీ నూతన డీఎస్పీగా రాజేశ్‌ను నియమించారు. స్వాతిప్రియ ఆత్మహత్యతో ఇంతకు ముందు ఇక్కడ ఉన్న సీఐ రాకేశ్ డిప్యూటేషన్ రద్దు చేసి మల్టీజోన్-1 ఐజీ కి అటాచ్ చేశారు. బుధవారం డీఎస్పీగా రాజేశ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు లు జారీ చేసింది. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఏవో రణదీర్ తెలిపారు.


ట్రిపుల్ ఐటీ గేటు వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ

## ట్రిపుల్ ఐటీ ప్రశాంతం

### నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

బాసర, నవంబర్ 13 : బాసర ట్రిపుల్ ఐటీలో ప్రశాంత వాతావరణం ఉందని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. బుధవారం ట్రిపుల్ ఐటీని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాస్తున్నారని, సెక్యూరిటీ సిబ్బంది కూడా విధులు నిర్వహిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. మెయిన్ గేట్ వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎస్పీ వెంట భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, ముథోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్సై గణేశ్ ఉన్నారు.


పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్పీ గౌష్ అలం

## శాంతి భద్రతలపై అప్రమత్తంగా ఉండాలి

### ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

ఇంద్రవెల్లి, నవంబర్ 13 : సమాజంలో శాంతి భద్రతలపై పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గౌష్ అలం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్ఐ దుబ్బాక సునీల్ పాల్గొన్నారు.

## వాగు దాటాలంటే.. తెప్పే ఆధారం

### సాగు కోసం రైతన్న సవాలక్ష ఫీట్లు

*కల్లూరు-బూరుగుపల్లి(కే) గ్రామాల మధ్య 30 ఏండ్ల క్రితం వాగుపై నిర్మించిన వంతెన తొమ్మిది నెలల క్రితం కూలింది. ఎస్సారెస్పీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ వంతెన పలు గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఉండేది. బూరుగుపల్లికి చేరుకోవడానికి రైతులు కల్లూరు నుంచి వానల్‌పాడ్ ద్వారా తమ చేలకు చేరుకోవాల్సి వస్తున్నది. దాదాపు ఏడు కిలో మీటర్ల వరకు తిరగాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మొత్కుపల్లి, పెండ్‌పల్లి తదితర గ్రామాలకు వెళ్లడానికి రవాణా సౌకర్యం ఆగింది. రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఒక రైతు గత్యంతరం లేక తెప్పని తయారు చేసుకుని తన వ్యవసాయ భూమికి రాకపోకలు సాగిస్తున్నాడు. ఈత వచ్చిన వాళ్లు ఒక ఇనుప పైపు సాయంతో దాటుతున్నారు. ప్రమాదమని తెలిసినా రైతులు ప్రాణాలకు తెగించి వాగును దాటుతున్నారు.*

*- కుంటాల, నవంబర్ 13*



గతంలో కూలిన అనుసంధానం వంతెన


బీఎల్‌వోను ఓటరు నమోదు వివరాలనుఅడిగి తెలుసుకుంటున్న సురేంద్ర మోహన్

## ఓటరు జాబితాలో నమోదు చేయాలి

### పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

ఎదులాపురం, నవంబర్ 13 : జనవరి 1, 2025 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకుడు సురేంద్ర మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ఓటరు నమోదు కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా స్థానిక పెన్‌గంగా గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. అనంతరం శాంతినగర్‌లోని పీఎస్ నంబర్ 283 ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంజయ్‌నగర్ పీఎస్ నంబర్ 212లో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి బీఎల్‌వోలను ఓటర్ నమోదు ఎలా చేస్తున్నారు. ఇప్పటివరకు ఎన్ని నమోదు అయ్యాయి అని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.


స్టీల్ పైపు సాయంతో వాగు దాటడానికి ప్రయత్నిస్తున్న రైతు


తెప్ప సహాయంతో వాగు దాటుతున్న ఓ రైతు